క్లుప్తంగా

సైనికుల త్యాగాలు స్మరిస్తూ ర్యాలీ



అమరావతి: స్థానిక శ్రీ సరస్వతి శిశు విద్యా మందిర్ చిన్నారులు కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమరేశ్వర స్వామి దేవస్థానం నుంచి మెయిన్ రోడ్డులో చిట్టి చేతులతో జాతీయ జెండాలు పట్టుకొని ముందుకు సాగారు. సైనికుల త్యాగాలు గుర్తుచేస్తూ ర్యాలీని కొనసాగించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఉపకరణాల పంపిణీ



సత్తెనపల్లి: ఫ్లోరోసిస్, ఎముకల సంబంధిత ఇబ్బందులతో బాధపడే వారికి వాకింగ్ స్టిక్స్, నెక్ బెల్ట్స్, లంబార్ బెల్ట్స్ శుక్రవారం పంపిణీ చేశారు. జాతీయ ఫ్లోరోసిస్ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా వీటిని అందించారు. సత్తెనపల్లి మండలం కొమెరపూడి గ్రామంలో పణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ ఎస్.వి.ఎస్ సాయితేజరెడ్డి లబ్ధిదారులకు ఉపకరణాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు యర్రా వెంకటేశ్వర్లు, అశోక్ , కమ్యూనిటీ హెల్త్ అధికారి వైశాలి, ఆరోగ్య కార్యకర్త నాగేశ్వరరావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో కుష్టు వ్యాధిపై సర్వే



ముప్పాళ్ళ: మండలంలోని అన్ని గ్రామాల్లో కుష్టు వ్యాధిపై సర్వే కొనసాగుతున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి పి.జయకృష్ణ శుక్రవారం తెలిపారు. ఆయా గ్రామ సచివాలయాల పరిధిలోని వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. శరీరంపై మచ్చలు ఏమైనా ఉన్నాయా అని సర్వే చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే నెల 2వ తేదీ వరకు సర్వే కొనసాగుతుందన్నారు. దమ్మాలపాడు గ్రామంలో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. సూపర్‌వైజర్లు పీటర్ డేమియన్, జోస్పిన్‌రాణి, సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు పంపిణీ



పెదకూరపాడు: పెదకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పూర్వ విద్యార్థి అత్తోటి మురళీ ముకుంద్ నోట్ పుస్తకాలు అందించారు. ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ మాట్లాడుతూ.. ప్రతి ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఉపకార వేతనాలతోపాటు, విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందిస్తున్న మురళీ సేవలను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాయపూడి సాంబశివరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమయ పాలన అవసరం



పెదకూరపాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో సమయపాలన పాటించాలని మండల ప్రత్యేక అధికారి ధనలక్ష్మి సూచించారు. శుక్రవారం పెదకూరపాడులోని 6వ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉంచాలన్నారు. పిల్లలకు పౌష్టికాహారాన్ని సకాలంలో అందించాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. సూపర్‌వైజర్ మున్ని తదితరులు ఆమె వెంట ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదకూరపాడు: మండలంలోని 75 త్యాళ్లూరు సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో మరమ్మతుల నిమిత్తం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. ఈ మేరకు విద్యుత్ శాఖ ఏఈ దాసరి రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సత్తెనపల్లిలో భయానక వాతావరణం

- కార్యకర్తలపై హత్యాయత్నాలు దారుణం
- వైఎస్సార్ సీపీ జెండా దిమ్మెలు కూల్చడం దుర్మార్గం
- పార్టీ శ్రేణుల వాహనాల దహనం సరికాదు
- శాసనసభ్యుడు కన్నా ఖండించకపోవడం గర్హనీయం
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ



సత్తెనపల్లిలో నల్లరిబ్బన్‌లు ధరించి నిరసన ప్రదర్శన చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సత్తెనపల్లి : సత్తెనపల్లి నియోజకవర్గంలో భయానక వాతావరణం నెలకొందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, గుంటూరు మిర్చి యార్డు మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ అన్నారు. నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై హత్యాయత్నాలు, జెండా దిమ్మెలు ధ్వంసం చేయటం, ద్విచక్ర వాహనాలు తగలబెట్టడం వంటి దుర్మార్గపు చర్యలు జరుగుతున్నా శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ ఖండించకపోవడం దారుణమని పేర్కొన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో శుక్రవారం ఆయన స్థానిక నాయకులతో కలిసి పర్యటించారు. వైఎస్సార్ సీపీకి ఎలాంటి సమాచారం, నోటీసులు ఇవ్వకుండా మున్సిపల్ అధికారులు జెండా దిమ్మెలను ధ్వంసం చేయడం పట్ల నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిమ్మకాయల మాట్లాడుతూ.. 'వై నీడ్స్ ఏపీ జగన్' కార్యక్రమంలో భాగంగా పట్టణంలో ఏర్పాటు చేసిన జెండా దిమ్మెలను కేవలం రాజకీయ కక్షతోనే మున్సిపల్ అధికారులు కూల్చివేశారన్నారు. అదే ప్రాంతంలో టీడీపీ, జనసేన, కాంగ్రెస్.. ఇతర పార్టీలకు చెందిన జెండా దిమ్మెలు ఉన్నా వదిలేశారని గుర్తుచేశారు. ఈ చర్యలను శాసనసభ్యుడు ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రంథాలయాల సంస్థ పూర్వ చైర్మన్ చిట్టా విజయ భాస్కర రెడ్డి మాట్లాడుతూ.. అధికారం ప్రతి ఐదేళ్లకోసారి మారుతూ ఉంటుందన్న విషయాన్ని సీనియర్ నాయకులు గుర్తుంచుకోవాలన్నారు. కార్యకర్తలపై దాడులు సరికాదన్నారు. సీనియర్ న్యాయవాది పక్కాల సూరిబాబు మాట్లాడుతూ.. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా వైఎస్సార్ సీపీ జెండా దిమ్మెలను తొలగించటం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. ముందుగా 22, 24, ఇతర వార్డులలో ధ్వంసం చేసిన వైఎస్సార్ సీపీ జెండా దిమ్మెలను నాయకులు, కార్యకర్తలు పరిశీలించారు. అనంతరం ర్యాలీగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకొని మున్సిపల్ డీఈ బి.మధుసూదన్‌రావుకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు షేక్ నాగూర్ మీరాన్, రమావత్ కోటేశ్వరావు నాయక్, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, నాయకులు వరికల్లు కోటేశ్వరరావు, పెద్దింటి వెంకటేశ్వర్లు, గుజ్జర్లపూడి సతీష్, లోకా మాధవ, బండి మల్లికార్జునరెడ్డి, గద్దం వెంకటేశ్వర్లు, గంటా ఏసుబాబు, కూకుట్ల శ్రీను, తోట లక్ష్మీ నారాయణ, కృపారావు, పలువురు కౌన్సిలర్లు , వైఎస్సార్ సీపీ అనుబంధ సంఘాల బాధ్యులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీ అండగా ఉంటుంది

ఏసుబాబుకు నిమ్మకాయల భరోసా



క్షతగాత్రుడు ఏసుబాబును పరామర్శిస్తున్న నిమ్మకాయల రాజనారాయణ

సత్తెనపల్లి: టీడీపీ గూండాల హత్యాయత్నంతో తీవ్రంగా గాయపడిన సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామానికి చెందిన మట్టుపల్లి ఏసుబాబు(మోజేష్)ను వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ తదితరులు శుక్రవారం పరామర్శించారు. డాక్టర్ గీతా మల్టీ స్పెషాలిటీ వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఆయనకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. జరిగిన సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిమ్మకాయల మాట్లాడుతూ.. దళిత వర్గాల పై ఇలాంటి దాడులు సహేతుకం కాదన్నారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. రాజనారాయణ వెంట నాయకులు చిట్టా విజయ భాస్కర్‌రెడ్డి, పక్కాల సూరిబాబు, చల్లంచర్ల సాంబశివరావు, అచ్యుత శివప్రసాద్, తోట లక్ష్మీనారాయణ, పలువురు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ అనుబంధ సంఘాల బాధ్యులు, తదితరులు ఉన్నారు.

ఆధార్ శిబిరాలకు 'సర్వర్' పాట్లు



క్రిస్టియన్‌పేటలోని 5వ సచివాలయంలో వివరాలు అప్‌డేట్ చేయించుకుంటున్న యువకుడు

సత్తెనపల్లి: ఆధార్ వివరాల మార్పుచేర్పులకు ఏర్పాటైన శిబిరాలకు సర్వర్ సమస్యలతో ఇబ్బందులు వస్తున్నాయి. గ్రామ/వార్డు సచివాలయాల్లో, ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 23వ తేదీన శిబిరాలు మొదలుపెట్టారు. 27వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ప్రచారం లేకపోవడం, వెళ్లినా సర్వర్ సమస్యతో ఒక్కో శిబిరం వద్ద 20 మందిలోపు మాత్రమే వస్తున్నారు. దీంతో గడువు పెంచాలని ప్రజలు కోరుతున్నారు. నియోజకవర్గంలోని సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లో షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్, ఆయా మండలాల ఎంపీడీవోలు వెల్లడించారు. సర్వర్, ఆధార్ కిట్ సమస్యలతో శిబిరాలు కొన్ని చోట్ల నిర్వహించలేని పరిస్థితి నెలకొంది. శనివారం సత్తెనపల్లి పట్టణంలోని కంబాలబావి ఏరియా (4వ సచివాలయం)లో, సత్తెనపల్లి మండలం కట్టావారిపాలెం, వావిలాలనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో, నందిగామ–1 సచివాలయంలో శిబిరాలు ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహిస్తారు.

రూ.80 వేల విలువైన మందు సీజ్

క్రోసూరు: జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి, వ్యవసాయ శాఖ మండల ఏవో వేణుగోపాల్‌లు శుక్రవారం క్రోసూరులోని నవతా ట్రాన్స్‌పోర్టు, కల్యాణి ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 110 లీటర్ల పిక్‌అప్ అనే పేరు కలిగిన బయోస్టిములెంట్‌ను సంబంధిత పత్రాలు లేకుండా రవాణా చేస్తున్నందుకు సీజ్ చేశారు. ట్రాన్స్‌పోర్టు నిర్వాహకులతో వారు మాట్లాడుతూ.. నాసి రకం విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల రవాణాపై జాగ్రత్తగా ఉండాలన్నారు. అలాంటి స్టాక్‌పై స్థానిక అధికారికి సమాచారం ఇవ్వాలని తెలిపారు.

ఏఎంసీ మాజీ చైర్మన్‌కు పితృవియోగం



చెన్నయ్య (ఫైల్)

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పెండెం బాబురావుకు పితృవియోగం కలిగింది. పట్టణంలోని 31వ వార్డులో శుక్రవారం రాత్రి బాబురావు తండ్రి పెండెం చెన్నయ్య (79) గుండెపోటుతో మృతి చెందారు. చెన్నయ్య మృతి విషయం తెలుసుకున్న పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, న్యాయవాదులు భౌతికకాయానికి నివాళులర్పించారు.

బాల్యం నుంచే దేశభక్తి అలవర్చుకోవాలి



సత్కారం అందుకున్న మాజీ సైనికులతో చలువాది తదితరులు

సత్తెనపల్లి: బాల్యం నుంచే ప్రతి ఒక్కరూ దేశభక్తి పెంపొందించుకోవాలని శ్రీసరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాల కార్యదర్శి చలువాది చిన్నసత్యనారాయణ అన్నారు. కార్గిల్ విజయ్ దివస్‌లో భాగంగా పట్టణంలోని పాఠశాలలో మాజీ సైనికులను శుక్రవారం సత్కరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన చలువాది మాట్లాడుతూ.. కార్గిల్ పోరాటం గురించి విద్యార్థులకు వివరించారు. మాజీ సైనికులు సత్యనారాయణరెడ్డి, భగవంతరావు, విజయ భాస్కరరెడ్డిలు తమ అనుభవాలను తెలిపారు. మన్నవ ధనలక్ష్మి వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో శ్రీ సరస్వతి శిశుమందిర్ విద్యాపీఠం జిల్లా కార్యదర్శి కట్టా శంకరరావు, పాఠశాల కమిటీ సభ్యులు రాంబాబు, హరి, దేవరశెట్టి రవికుమార్ తదితరులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ఎహెచ్‌సీ ఆవరణలో మొక్క నాటి నీరు పోస్తున్న తులసీకుమార్

అచ్చంపేట: మొక్కలను ప్రతి ఒక్కరు నాటి సంరక్షించుకోవడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ కె.తులసీకుమార్ తెలిపారు. హరిత ప్రపంచం కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అందరూ తమవంతుగా మొక్కలు నాటాలని చెప్పారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ రాంబాబు నాయక్, ఆరోగ్య విస్తరణాధికారి పి.వెంకటరావు, బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ సోలాయి రాజ, ఇస్మాయిల్, శ్రీను, చలువాది జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువల్లో పూడికతీత



బెల్లంకొండ: మండలంలోని వన్నాయపాలెం గ్రామంలో శుక్రవారం పంచాయతీ అధికారులు పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టారు. సిబ్బందితో మురుగు కాలువలలో పూడికను తొలగింపజేశారు. దోమలు వ్యాప్తి చెందకుండా యాంటీ లార్వా ద్రావణాన్ని పిచికారి చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మేకల త్రివేణి, పంచాయతీ కార్యదర్శి కటకం శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు వినతి

అమరావతి: మండల కేంద్రమైన అమరావతి రాజీవ్ కాలనీలో మూడు రోజులుగా తాగునీరు సరఫరా కాక ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యదర్శికి తెలిపారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా కాలనీ వాసి కారసాల ప్రసన్నకుమార్ మాట్లాడుతూ.. నెలలో రెండు, మూడు రోజులు మోటారు రిపేర్ అని చెప్పి నీరు సరఫరా చేయటం లేదన్నారు. ప్రస్తుతం మూడు రోజుల నుంచి బోర్లపై ఆధారపడి రాత్రిపూట నీరు తెచ్చుకుంటున్నామని పేర్కొన్నారు. కృష్ణానది పక్కనే ఉన్నా తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ముందుగా సమాచారం ఇవ్వడంగానీ, ప్రత్యామ్నాయం చూపడంగానీ చేయాలని కోరారు. పంచాయతీ అధికారులు త్వరితగతిన సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు.

కక్షలకు దూరంగా ఉండాలి



రాజుపాలెం: గ్రామాలలోని ఇరువర్గాల వారు కక్షలకు దూరంగా ఉండాలని సత్తెనపల్లి డీఎస్పీ జి.గురునాథబాబు సూచించారు. మండలంలోని ఫ్యాక్షన్ గ్రామమైన పెదనెమలిపురిలో పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులకు శాంతిభద్రతలపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. కక్షల వల్ల గ్రామాలలో అభివృద్ధి కుంటుపడడమే కాకుండా కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతాయన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ రాంబాబు, ఎస్ఐ అమీర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి



నకరికల్లు: రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని డ్వామా పీడీ, మండల ప్రత్యేక అధికారి బి.బాలూనాయక్ సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. వైద్యశాలలో అందిస్తున్న సేవలు, మౌలిక వసతుల గురించి ఆరా తీశారు. అనంతరం వైద్యసిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డి.జయమణి, డాక్టర్ మణికంఠ, సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు చర్యలు



రాజుపాలెంలోని బావిలో గంబూషియా చేపలు వదులుతున్న సిబ్బంది

రాజుపాలెం: మండలంలోని రాజుపాలెం, చౌటపాపాయపాలెం, బ్రాహ్మణపల్లి గ్రామాలలో వాడుకలో లేని బావులలో దోమలు పెరగకుండా గంబూషియా చేప పిల్లలను శుక్రవారం వదిలారు. ఈ చేపల ద్వారా దోమల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కృష్ణకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, ఏఎన్‌ఎంలు ప్రమీలాబాయి, లక్ష్మీతిరుపతమ్మ, రాజ్యలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ రాజు, ఆశా కార్యకర్తలు భాగ్యలక్ష్మి, రాధ, నామాల ప్రసన్నలక్ష్మి, రెబ్బమ్మ, మద్దెమ్మ, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

వాహన చోదకుల నిర్లక్ష్యం ప్రాణానికే ప్రమాదం



మాట్లాడుతున్న జక్కుల లక్ష్మీనారాయణ

అమరావతి: వాహన చోదకులు నిబంధనలు పాటించకుండా నిర్లక్ష్యంగా ఉంటే ప్రాణాలకే ప్రమాదమని పారా లీగల్ వలంటీర్ జక్కుల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి వెంకట నాగ శ్రీనివాసరావు సూచనల మేరకు యువతకు మోటారు వాహనాల చట్టం గురించి స్థానిక బస్టాండ్ వద్ద శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జక్కుల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ప్రతి వాహనదారుడు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. యువత ఎక్కువగా రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్నారని, ఎక్కువశాతం తలకు గాయం కావడం వల్లేనని గుర్తుచేశారు. జూలై ఒకటో తేదీ నుంచి దేశంలో కొత్త చట్టాలు అమలులోకి వచ్చాయని హెచ్చరించారు. నిబంధనలు పాటించకుంటే చట్టపరంగా కూడా ఇబ్బందులు తప్పవని తెలిపారు. ప్యానల్ న్యాయవాది బి.ఎల్. కోటేశ్వరరావు మాట్లాడుతూ.. అతివేగం కారణంగా యువత రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నారని పేర్కొన్నారు. స్థానిక సబ్ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్.ప్రసాదరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

'టీడీపీ గూండాలపై చర్యలు తీసుకోవాలి'



క్షతగాత్రుడు ఏసుబాబును పరామర్శిస్తున్న పెండెం బాబురావు, జడ ప్రసాద్

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త, దళిత యువకుడు మట్టుపల్లి ఏసుబాబు (మోజెస్)పై హత్యాయత్నానికి పాల్పడిన టీడీపీ గూండాలపై చర్యలు తీసుకోవాలని సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పెండెం బాబురావు డిమాండ్ చేశారు. పట్టణంలోని గీతా మల్టీ స్పెషాలిటీ వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఏసుబాబును శుక్రవారం ఆయన పరామర్శించారు. దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాబురావు మాట్లాడుతూ.. పథకం ప్రకారం టీడీపీకి చెందిన ఆరుగురు గూండాలు ఏసుబాబుపై హత్యాయత్నానికి ఒడిగట్టారన్నారు. తక్షణమే వారిని పోలీసులు అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కులం పేరుతో దూషిస్తూ దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఇతర పార్టీలను, ప్రజా సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. మునుపెన్నడూ లేని విధంగా దాడులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఏసుబాబుకు ధైర్యం చెప్పి, వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయనతో పాటు వైఎస్సార్ సీపీ నాయకుడు జడ ప్రసాద్, తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూం

క్రోసూరు: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో శుక్రవారం నుంచి పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టినట్లు ఎంపీడీవో టీవీ రమణ తెలిపారు. మండ పరిషత్ పరిపాలన అధికారి ఎస్.స్వరూపారాణి ఆదేశాల మేరకు ఆగస్టు 10వ తేదీ వరకు సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కె.సందీప్‌కుమార్(అగ్రికల్చర్ అసిస్టెంట్, క్రోసూరు – 98669 47909) ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఇక్కడ అందుబాటులో ఉంటారని చెప్పారు. షేక్ ఖాజావలి (పంచాయతీ కార్యదర్శి, క్రోసూరు – 89772 73702) మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 వరకు, షేక్ అఫ్రోజ్ (వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, అందుకూరు – 96663 03566) రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు అందుబాటులో ఉంటారన్నారు. పీఆర్ వన్ యాప్ ద్వారా ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు ఫిర్యాదుల వివరాలు తెలిపి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో తెలిపారు.

అర్హులందరికీ పీఎం కిసాన్ సాయం



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి

దొడ్లేరు(క్రోసూరు): అర్హత ఉండి కూడా పీఎం కిసాన్ పథకం కింద సాయం అందని రైతులు స్థానిక వ్యవసాయ సహాయకులను కలవాలని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి సూచించారు. సంబంధిత ధ్రువపత్రాలను అందిస్తే సమస్యను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. శుక్రవారం దొడ్లేరు–2 రైతు సేవా కేంద్రంలో కౌలు రైతులకు కార్డులు, పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ, భూసార పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ.. కౌలు రైతులు తప్పని సరిగా కార్డులు పొందాలన్నారు. అందుకు కావాల్సిన పత్రాలన్నీ వ్యవసాయ సహాయకులు లేదా వీఆర్వోలకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో వేణుగోపాల్, రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు కె.కమల, ఆర్. దివ్య, రైతులు పాల్గొన్నారు.

కౌలు రైతులు కార్డులు తీసుకోవాలి

అచ్చంపేట: కౌలు రైతులంతా తప్పనిసరిగా కార్డులు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి సూచించారు. మండలంలోని కొండూరులో శుక్రవారం రైతు సదస్సులో ఆయన మాట్లాడారు. కౌలు రైతులకు కార్డులు పంపిణీ చేశారు. వీరికి భూమిపై ఎలాంటి హక్కులు ఉండవన్న విషయాన్ని యజమానులు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి పి.వెంకటేశ్వర్లు, వీఆర్వో రాజబాబు, గ్రామ కార్యదర్శి ఉమామహేశ్వరరావు, వ్యవసాయ, ఉద్యాన శాఖల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'చలో పొన్నూరు' కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

సత్తెనపల్లి: దళితుల ఆత్మగౌరవ పోరాట యోధుడు, కవి, రచయిత కత్తి పద్మారావు జన్మదినం సందర్భంగా 27న గుంటూరు జిల్లా పొన్నూరు గ్రామంలో వేడుకలు, పుస్తకావిష్కరణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వీటిని జయప్రదం చేయాలని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాసరి జ్ఞాన్‌రాజ్‌పాల్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం తాలూకా సెంటర్‌లో 'చలో పొన్నూరు' పేరిట రూపొందించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో దళిత, బహుజన నాయకులు దావులూరి కోటేశ్వరరావు, అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు జిల్లెళ్ల పాల్‌రాజ్, కోటపాటి సాంబశివరావు, పిల్లుట్ల వెంకటేశ్వర్లు, జెట్టి శేఖర్, మీసాల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకం అందరి బాధ్యత



మొక్క నాటి నీరు పోస్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్ కె.శ్రీనివాసరావు, బ్యాంకు మేనేజరు ఛత్రు

క్రోసూరు: మొక్కలు నాటి పరిరక్షించటం అందరి బాధ్యత అని క్రోసూరు ఇన్‌చార్జి తహసీల్దార్ కె.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. చెట్లు లేకుంటే జీవకోటి మనుగడ ప్రమాదంలో పడతుందని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు మేనేజరు ఛత్రు, స్పెషల్ అసిస్టెంట్ రాజేష్, వీఆర్వో బ్రహ్మనాయుడు తదితరులు పాల్గొన్నారు.